# 500 రూపాయలు

–కుంతి

"హలో పాండూ! నేను మల్లి కార్జున్ ను. బొత్తిగా కలవవు.నల్లపూసపై పోయావు.ఫోన్  కూడా చేయవు"

"హల్లో మల్లి! హౌ ఆర్ యూ! అంతా కులాసాయే కదా! సారీ బ్రదర్!సంసార వ్యాపకములో పడిపోయాను.అంతా బాగేనే కదా"సమాధానంగా అన్నాడు.

"నేను బాగానే ఉన్నాను.ఈ రోజు సాయంత్రము మన మిత్రులు చారీ,శ్రీనివాస్  డైమండ్ బార్అండ్ రెస్టారెంట్ లో కలుద్దామంటున్నారు.. చాలా రోజులైంది .సిట్టింగులు లేక. సరదాగా ఉంటుంది.రాకూడదు.మా అంటే తలా ఒక అయిదు వందల రూపాయల ఖర్చు"

"సారీ బ్రదర్!రావాలనే ఉంది. కానీ_________వద్దులే___________ఇంకొకసారి చూద్దాము. మరొక విధంగా అనుకోకు.ఇన్విటేషన్ కు థ్యాంక్స్.ఉంటాను"ఫోన్ పెట్టేసాడు పాండు.

పార్టీ,చిన్ననాటి మిత్రులు. కానీ అయిదు వందల రూపాయల ఖర్చు. అదీ నెలాఖరులో __ఒక్కసారిగా నిట్టూర్చాడు. తన జేబులో చివరి అయిదు వందల రూపాయల నోటు భద్రంగా ఉంది. ఇంకా వారము గడవాలి. పేతన జీవుల వెతలు భగవంతునికే తెలియాలి"అనుకుంటూ, టవును పోస్ట్ ఆఫీసులో పోస్ట్ మాస్టర్ గా ఉద్యోగము చేస్తున్న పాండురంగారావు "ఉత్తరవిధులు"నిర్వహించడానికి సిద్ధపడుతూ ప్యాంట్ వేసుకోబోతుండగా,

"నాన్నా ఆరుసెలల నుండి నాకు క్రికెట్ బ్యాట్ కొనిస్తాను ,కొనిస్తాను అంటున్నారు ,పక్కింటి బంటీ కొత్త బ్యాట్ కొనుక్కున్నాడు.తన పాత బ్యాట్ నాకు అయిదు వందల రూపాయలకే ఇస్తానన్నాడు. నిజానికి దాని ధర రెండు వేలరూపాయలు.నాకు అయిదు వందల రూపాయలు ఇవ్వరు" ఎనిమిదవ తరగతి చదువుతున్న కొడుకు గోముగా అడిగాడు.

"సారీ నాన్నా! నాకుకొనివ్వలనిఉంది  కానీ________వద్దులే_________ఇంకొక సా రి చూద్దాము. మా బాబు చాలా మంచి వాడు"అంటూ బుజ్జగించి షర్ట్ వేసుకోబోతుండగా,

" నాన్నా! మా కాలేజీ అమ్మాయిలు అంతా కలిసి ఈ ఆదివారము శ్రీ శైలము వెళుతున్నారు. జస్ట్ అయిదు వందల రూపాయలు కట్టాలి.ఇవ్వండి నాన్న. పోయిన సంవత్సరము కూడా నన్ను పంపలేదు"ఇంటర్ చదువుతున్న కూతురు డిమాండ్.

"వెరీ సారీ బంగారి! నాకు నిన్ను పంపాలనే ఉంది కాని _________వద్దులే_________ఇంకొకసారి చూద్దాము"చొక్కా బొత్తాలు పెట్టుకొని తలదువ్వుకోబోతుండగా,

"పక్కింటి రమణమ్మ బెంగులూరు నుండి మంచి చీరలు తెచ్చింది చాలా బాగున్నాయి,చవక కూడా  ఒక్క చీర కేవలము అయిదు వందల రూపాయలు మాత్రమే"శ్రీమతి నుండి విజ్ఞాపన.

"సారీ డియర్! నాకు కొనివ్వాలనే ఉంది. కానీ_______________వద్దులే________ఇంకొకసారి చూద్దాము.డోంట్ థింక్ అదర్ వైజ్"సర్దిన టిఫిన్ క్యారియర్ ను బ్యాగ్ లో పెట్టుకొని షూ వేసుకోబోతుండగా'

'ఒరేయి అబ్బాయి! సాయి సేవాట్రస్ట్ వారికి అయిదు వందల రూపాయలు విరాళము పంపాలి"అమ్మ ఆజ్ఞ. "నాకూ ఇవ్వాలని ఉంది.కానీ _________వద్దులే________ఇంకొకసారి చూద్దాము.

ఇంకా అక్కడ ఎక్కువ సేపు  ఉండకూడదనుకొని ,బండి స్టార్ట్ చేసుకొని వెళ్ళిపోయాడు.

ఆఫీసు తెరిచీ తెరవడముతో రద్దీ మొదలయింది. కార్డ్స్,ఎన్వలప్స్,మనీ ఆర్డర్స్ ,ఇన్సూరెన్సులు ____________ఒక్క చేయితో అన్ని పనులు చేయసాగాడు.  ఆరోజు ఒక కొలీగ్ లీవు పెట్టాడు.ఇంకొక వ్యక్తి సడన్ గా యేమి పని పడిందో తెలియదు కాని రాలేదు. పనిలో ఉండగా ,మధ్యమధ్యలో ,ఉదయం పూట ఇంటిలో వారడిగిన చిన్నకోరికలు,వాటిని తాను ఎలా వాయిదావేస్తూ వస్తుంది,గుర్తుకు రాసాగింది.

భార్యా పిల్లల కోరికలు తీర్చలేనందుకు బాధ కలిగింది.తన భార్యా పిల్లలు మంచివారు.తన బాధలను అర్ధము చేసుకుంటారు. ఇంతలో ఒక వ్యక్తి ఇన్సురెన్స్ అమౌంట్ తెచ్చాడు.అపుడే హెడ్ ఆఫీసు నుండి   ఫోన్ వచ్చింది. కావలసిన క్లారిఫికేషన్స్ ఇస్తుండగా ,ఎవరో కార్డ్స్ కోసము వచ్చారు.కార్డ్స్ యివ్వగానే ఎవరో ఆర్ డీ ఫార్మ్ అడిగారు. ఫోన్ లో మాట్లాడుతూ అన్ని పనులు చేయసాగాడు.మరి కొదిసేపట్లో పీ ఎల్ ఐ తాలూకు డబ్బు తీసుకుంటుండగా చిన్న చెల్లెలు రమణి నుండి ఫోన్ వచ్చింది. " "అన్నయ్యా! మా కాలేజీ లో స్టడీ మెటీరియల్ ప్రత్యేకంగా తయారు చేసారు.అందరూ కొనుక్కుంటున్నారు. అయిదు వందలు  కడితే ఇస్తారట. పంపించవూ"

యధా ప్రకారము సమాధానముచెప్పి ఫోన్ పెట్టేసాడు. మనసు పెట్టి పని చేయసాగాడు.ఇంతలో ఎదురుగా చిన్న నాటి మిత్రుడు కాంతారావు . "పాండూ!అర్జంట్ గా ఊరికి వెళ్ళాలి. ఒక్క అయిదు వందలు సర్దు. మళ్ళీ జీతము రాగానే పువ్వులో పెట్టి ఇస్తాను"

సారీ కాంతారావు!నాకు ఇవ్వాలనే ఉంది కానీ______ ఇపుడు వల్ల కాదు.ఇంకొకసారి హెల్ప్ చేస్తాను"

నాకిప్పుడు అవసరము ఉంటే, ఇంకొకసారి అంటావేమిట్రా? అయినా నిన్ను అడగడ నా బుద్ధితక్కువ" అంటూ విసావిసా వెళ్ళిపోయాడు.

పాండురంగారావు కు ఉన్నట్లుండి అయిదు వందల రూపాయల నోట్ ఎంత మహత్తు కలది ,ఎంత మందికి ,ఎన్ని రకాలుగా అవసరాలు తీరుస్తుందిఅనిపించింది. అతడికి ఆనోటు కల్ప వృక్షములా ,కామధేనువు లా అనిపించింది. విశ్వమంతా ఆవరించిన త్రివిక్రముడిలా తోచింది. అయినా అంతటంతటి ఘనమైన ఆ కాగితము తన యే ఒక్క అవసరానికి,ముందుకు రానందుకు ,తత్కారణమైన పరిస్థితికి బాధేసింది. " రూపాయిని నువ్వు కాపాడు. రూపాయి నిన్ను కాపాడుతుంది,ఇదే కదా నేను నమ్మిన సిద్ధాంతము ,తానేమిపీనాసి కాదు కదా"అనుకున్నాడు "దీని ఎలాగైనా పోనివ్వకూడదు. లేకుంటే నెల చివర్లోచేయి చాపాల్సిఉంటుంది,అనుకున్నాడు.

అలా ఆలోచనలతో కొట్టుమిట్టాడుతుండగా,

మధ్యాహ్నమయింది. ఆ రోజు చాలా ట్రాన్ సాక్షన్ నడిచింది.కొందరికి యివ్వడము,కొందరి దగ్గరి నుండి తీసుకోవడము ________ఇలా చాలా డబ్బు చేతులు మారింది. లంచ్ సమయము కావడముతో లంచ్ ముగించి ,ఆ రోజు జరిగిన ట్రాన్ సాక్షన్ తాలూకు అకౌంట్స్ అన్నీ చూడసాగాడు. కొద్ది సేపట్లో హెడ్ పోస్ట్ ఆఫీస్ వారికి లెక్కలు అప్పచేప్పాలి. తదేకంగా అకౌంట్స్ చూసడు. క్యాష్ లెక్కించాడు. అయిదు వందల రూపాయలు తక్కువ పడింది. మళ్ళీ మళ్ళీ చూసాడు. ఎక్కడైనా డబ్బులు పడిపోయాయేమోనని ఆఫీస్ మూలమూలలా వెదికాడు. లాభము లేదు తానే ఎవరి దగ్గరో తక్కువ తీసుకోవడమో,ఎక్కువ ఇవ్వడమో చేసాడు.

ఇంతలో క్యాష్ కలెక్షన్ చేసుకునే వ్యక్తి వచ్చాడు. అకౌంట్ చూసాడు. క్యాష్ చూసాడు. " మరేమి చేద్దాము. అయిదు వందలు తక్కువ అయ్యాయి కదా? ఇన్ వాల్వ్ అయి చేయలేకపోయారా?" అంతకు మునుపు ఒక సారి వెయ్యి రూపాయల చేబదులు అడిగితే ఇవ్వనందుకు కసిగా, మరుయు నీవే నొక్కేసావేమో అన్నట్లుగా అనుమానంగా చూస్తూ అన్నాడు. మొదటిసారి తన సర్వీసులో ఇలా జరిగింది. మనసు చివుక్కు మంది.

యేమి చేయాలో తోచలేదు. తోచడానికి యేమీ లేదు. క్యాష్ తక్కువైంది. జేబులో నుండి కట్టాలి. ఉదయము నుండి కంగారు పొట్టలో బిడ్డలా తన జేబులో ఒదిగి ఉన్న ఆ నోట్, తన సంతోషానికి, తన కుటుంబ అవసరాలకు లొంగని ఆ నోట్, నెల చివర్లొ తనకు బాసటగా నిలుస్తుందనుకున్న ఆ నోట్ తన అశ్రద్ధకు, నిర్లక్ష్యానికి ఏమరుపాటుకు కనబడకుండా పోయింది. కాళ్ళు వచ్చినడుచుకుంటూ పోయింది. అయిదువందల నోటును ఖర్చు పెట్టకుండాఅయిదు వందల జాగ్రత్తలు తీసుకున్నా ,అది అయిదువందల ఒకటవ మార్గములో వెళ్ళి పోయినందుకు చింతిస్తూ,నిస్సహాయంగా ఉండిపోయాడు.

కుంతి

(కె.కౌండిన్య తిలక్)
ఫ్లాట్ నం.203
శ్రీ సాయి ఎంక్లేవ్
శ్రీనివాస్ నగర్ కాలనీ
టెంపుల్ ఆల్వాల్
సికింద్రాబాద్–500010
8790920745
9441234325